క్లుప్తంగా

శ్రీరామనవమి శుభాకాంక్షలు


ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: శ్రీరామనవమి సందర్భంగా ప్రతి ఒక్కరూ శ్రీసీతారాముల కల్యాణం సందర్భంగా పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రీరామనవమి వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని అందరూ దేవుని ఆశీస్సులు పొందాలన్నారు. ప్రజలందరికీ శ్రీరామనవమి పండుగ సందర్భంగా మరింత మేలు జరగాలని కోరారు.

దుర్గి పోలీస్ స్టేషన్‌కు ఏడుగురు పోలీసు సిబ్బంది

దుర్గి: పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ కారణాలతో రిజర్వ్‌గా ఉన్న ఏడుగురు కానిస్టేబుల్స్ దుర్గి పోలీసు స్టేషన్‌కు నియమించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు సిబ్బంది వివిధ పోలీసు స్టేషన్‌కు నాదెండ్ల పిఎస్ నుంచి డివైఎస్ గోపీనాథ్, వీఆర్‌లో ఉన్న జె రమణయ్య, వి శ్రీనివాసనాయక్, కె చిన్న సైదులు, కె పరమేశ్వరరావు, ఏ సుబ్బయ్య, టి వెంకటేశ్వరరావులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వారు వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో తక్షణమే జాయినింగ్ రిపోర్టులను అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశంలో పేర్కొన్నారు.

ఏప్రిల్ 4న అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూ

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 4వ తేదీన అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చౌదరి బుధవారం తెలిపారు. కామర్స్–1 పోస్టుకు ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులను కలిగి ఉండాలన్నారు. ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ నెట్, ఏపీసెట్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఇంగ్లిషు మీడియంలో పాఠాలు చెప్పగలిగే అభ్యర్థులే అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఏప్రిల్ 4వ తేదీ ఉదయం 10గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు prdc. nafarj unarafarfmai .com కు రెజ్యూమ్ పంపగలరు. మరిన్నీ వివరాల కోసం : 9441730700 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంగ్లిష్ భాషపై పట్టుసాధించడం ఎంతో అవసరం

రెంటచింతల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై పట్టుసాధించడం ఎంతో అవసరమని డాక్టర్ ఎంబి చిన్నమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఫాతిమా విద్యానికేతన్ స్కూల్‌ల్లో నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే, గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి ఉన్నతమైన స్థానానికి చేరుకోవడానికి ఇంగ్లిష్ భాష ఎంతో దోహదపడుతుందన్నారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే, గ్రాడ్యుయేషన్ డే ఈ ప్రాంతంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు రొక్కం సాల్మన్‌రాజు, స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, హెచ్‌ఎం ఏరువ స్టెఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



పిడుగురాళ్ల: పట్టణంలోని రిక్షా కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి పైకప్పు పోయి ఇబ్బంది పడుతున్న దీనమ్మకు చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని చింతలపూడా చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ చింతలపూడి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాతో తండ్రి మరణించటం , తల్లి వదిలేసి వెళ్లడంతో ఇద్దరు మనవళ్లను పెట్టుకొని జీవనం సాగిస్తున్న ఆమెకు ఆర్థిక సహాయం చేయడం ఎంతో మంచి పరిణామని తెలియజేశారు. కార్యక్రమంలో చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు సభ్యులు తదితరులు ఉన్నారు.

విశేష అలంకరణలో మహాసరస్వతి అమ్మవారు



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగులు గుడి దేవస్థానంలో వసంత నవరాత్రుల్లో భాగంగా బుధవారం మహాసరస్వతి అమ్మవారిని విశేష పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి వెంకటేశ్వర శర్మ అమ్మవారిని దర్శించుకునేందుకువచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సమస్యల పరిష్కారానికే గ్రామోదయం


సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాస్

మాచర్ల రూరల్: గ్రామంలోని అన్ని సమస్యల పరిష్కారం కోసం గ్రామోదయ కార్యక్రమం అన్ని విధాలా ఉపయోగపడుతుందని ఎంపీడీఓ వి కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో గ్రామోదయం కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులతో మాట్లాడారు. అన్ని శాఖాధికారులు గ్రామానికి వచ్చి ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి ఆర్థిక పరమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు గ్రామోదయం ముఖ్య లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జెడ్పీహెచ్‌సి, వాటర్ షెడ్లు, పీహెచ్‌సి వైద్యశాలలను వారు పరిశీలించి అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షేక్ బాషా, ఏఈలు సురేంద్ర, బాబునాయక్, డాక్టర్ వెస్లి, సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, గ్రామ కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య తదితరులున్నారు.

వర్మి కంపోస్ట్‌తో పంచాయతీలకు ఆదాయం

రెంటచింతల: గ్రామాల్లోని ఇళ్లనుంచి సేకరించే తడి చెత్త, పొడిచెత్త ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లలో వర్మి కంపోస్ట్‌ను తయారుచేసి విక్రయించడం వల్ల గ్రామ పంచాయతీలకు అదనపు ఆధాయం సమకూరుతుందని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు అన్నారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు గ్రామంలో బుధవారం గ్రామోదయం కార్యక్రమాన్ని చేపట్టి స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల ద్వారా తయారుచేసిన వర్మికంపోస్ట్‌ను క్లాప్ మిత్రల సహాయంతో ప్యాకింగ్ చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలమారి నాగలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ సుబ్బారావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఏపి ట్రాన్స్‌కో ఏఈ మస్తానవలి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, ఏపీఎం వెలుగు చిన్నబాబు, గుండ్రెడ్డి అనంత కోటేశ్వరరావు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.


తాళ్ళపల్లిలో గ్రామోదయం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ, ఎంఈఓ, తహసీల్దార్

శ్రీరాంపురంతండాలో అధికారుల పర్యటన

వెల్దుర్తి: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు మండలంలోని శ్రీరాంపురంతండా గ్రామంలో మండల స్థాయి అధికారులు పర్యటించి స్థానికులనుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం గ్రామంలోని వీధుల్లో తిరిగి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. గ్రామంలో ఉన్న వర్మికంపోస్టు షెడ్‌లను, క్లాప్ మిత్రా వారితో కలిసి భోజనం చేయుట, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులు పౌష్టికాహారం, ఆరోగ్య విషయాల పై మాట్లాడామన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడామన్నారు. గ్రామంలో వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తాగునీటి సమస్య, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను ఎత్తు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ తుకారాం, సచివాలయ సిబ్బంది, సీసీ బంగారయ్య, గ్రామ సర్పంచ్ దేరంగుల ఏగయ్య, మాజీ సర్పంచ్‌లు కేతావత్ హనుమానాయక్, లక్ష్మానాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు మేరాజోత్ గోవిందునాయక్, అంజినాయక్, పీలు నాయక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాచవరంలో గ్రామోదయం

కారెంపూడి: మండలంలోని కాచవరం గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలోని నోడల్ టీమ్ గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో పర్యటించి గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గతంలో వైఎస్సార్, జగనన్న కాలనీలో 50 మందికి ఇచ్చిన నివేశన స్థలాల్లో కొన్ని శ్మశాన స్థలంలో ఉన్నాయని వీటిని రద్దు చేసి అందరికి కూడా గ్రామానికి కిలో మీటరు దూరంలో దాచేపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే ఉన్న సర్వే నంబరు 1054–2 ప్రభుత్వ భూమిలో పట్టాలివ్వాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను కోరారు. నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారు మరో 60 మంది ఉన్నారని వారికి కూడా అక్కడే పట్టాలివ్వాలని కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే 1981లో వేసిన విద్యుత్తు లైన్‌లో పాడైపోయిన స్తంభాలు మార్చాలని ప్రధానంగా ఊరి ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉందని గతంలో అక్కడ మూడు గేదెలు మృతి చెందాయని ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఆ పక్కనే ఉన్న ఉత్తరం వైపు బీట్లోకి మార్చాలని కోరారు. ఎస్సీ కాలనీలో ఒకటి, అలాగే తూర్పు బజారులో మరో స్తంభం ఏర్పాటు చేయాలని కోరారు. మోటారు లేక ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌కు నీరు ఎక్కడం లేదని తెలిపారు. ఎస్సీ కాలనీ ముందు సైడ్ డ్రైన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. 70 ఏళ్లుగా బి ఫాం పట్టాలు పొంది సాగు చేసుకుంటున్న కుంట భూమికి పట్టాలివ్వాలని 8 మంది పేదలు కోరారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నోడల్ టీమ్ అంగన్‌వాడీ సెంటర్ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని పరిశీలించారు. పొలం కొలతలు, రేషన్ కార్డులు, పింఛన్ల పంపిణీలో ఉన్న సమస్యల పరిష్కారానికి మరో 8 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు గ్రామోదయంలో పాలుపంచుకున్నారు. సర్పంచ్ దిబ్బమడుగు వెంకటరమణ వీరయ్య, మాజీ సర్పంచ్ క్రిష్టపాటి అంకిరెడ్డి, వెంకటరామిరెడ్డి, తిరుపతి రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి అధికారుల పర్యటనలో పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలకు వడ్డీ రాయితీ

గురజాల : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పాలిటెక్నిక్ , అగ్రికల్చరల్ రీ సెర్చ్ స్టేషన్ ఆస్థి పన్నును బుధవారం నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్‌కు అందించారు. రూ.3,53,342/–ల చెక్కును వార్డు కౌన్సిలర్ సుబ్బారెడ్డి చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు ఉన్న వారు వెంటనే వడ్డీ లేకుండా చెల్లించే అవకాశం ఉందని వెంటనే ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలల సాహిత్య పుస్తకాలు అందజేత



దాచేపల్లి : మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బాలల సాహిత్య పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. ప్రవాస భారతీయ వాసవి అసోసియేషన్ ఆధ్వర్యంలో పుస్తక మిత్ర రీడ్ టు లీడ్ కార్యక్రమంలో భాగంగా రూ.15 వేలు విలువ చేసే పుస్తకాలు అందించారు. సాహిత్యంపై పట్టుసాధించేందుకు విద్యార్థులకు ఈ పుస్తకాలు దోహదపడతాయని ప్రముఖ కవి కొసూరి రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లంకె వాసుదేవరావు, ఉపాధ్యాయులు గుదిబండి శ్రీనివాసరెడ్డి, ఆడేపు రాజేష్, జగన్నాధం, బండ్ల శ్యాంకుమారి, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు

కారెంపూడి: శ్రీరామ నవమి వేడుకలకు మండలంలోని రామాలయాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. దంపతులు పీటలపై కూర్చుని స్వామి కల్యాణం జరిపించడంతో పాటు అన్నదానం, ప్రసాదాల పంపిణీకి దేవాదాయ శాఖ ఆయా గ్రామాల ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. కారెంపూడిలోని కోదండరామాలయం అలాగే పెదకొదమగుండ్ల, ఒప్పిచర్లతో పాటు మిగిలిన అన్ని గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో నవమికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కారెంపూడిలో శ్రీరామనవమి శోభాయాత్రకు భక్తులు పిలుపునిచ్చారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి బైక్‌లతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించాలని యువత ఏర్పాట్లు చేస్తోంది. అలాగే అంకాలమ్మ గుడి సెంటర్‌తో పాటు గ్రామాల పలు కూడళ్లలో చలువ పందిళ్ల వేసి వడ పప్పు పానకం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంజనేయ స్వామి దేవాలయాల్లో కూడా ప్రత్యేక పూజాకార్యక్రమాలకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

మాచర్ల: పట్టణంలో శ్రీశైలం రోడ్డులో వేంచేసియున్న కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఆరవ రోజు శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విడేల సుందరరావు దంపతులు, కార్యదర్శి చిల్లంచర్ల సత్యనారాయణ, కోశాధికారి భవనారి నాగలోకనాథ్ కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు మారం ప్రసాద్, పోలిశెట్టి పిచ్చయ్యల ఆధ్వర్యంలో శ్రీరామ దంపతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ఉత్సవాల ప్రారంభోత్సవాల సందర్భంగా పూజలు చేస్తున్న భక్తులు


రామాలయం వద్ద చలువ పందిరి ఏర్పాటు చేస్తున్న భక్తులు

శ్రీరామనవమికి ఏర్పాట్లు

దాచేపల్లి : శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబు అయ్యాయి. ఆలయాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. నారాయణపురంలోని రెండు రామాలయాలు, దాచేపల్లిలోని రామాలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమంను కూడా ఏర్పాటు చేశారు.


పెదకొదమగుండ్ల గ్రామంలోని రామాలయం

నవమికి ఏర్పాట్లు పూర్తి

గురజాల : శ్రీరామ నవమికి దేవాలయాలు ముస్తాబయ్యాయి. గురజాల మండలంలోని పలు గ్రామాల్లో సీతారామాలయాలు, ఆంజనేయ స్వామి దేవాలయాలు ప్రత్యేకంగా ఆయా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరాముడి కల్యాణ మహోత్సవంలో పాల్గొనే దంపతుల పేర్లను నమోదు చేసుకుని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ఆంజనేయ స్వామి దేవాలయాలు, గాంధీబొమ్మ సెంటర్‌లో రాముల వారి దేవాలయంతో పాటు ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- గామాలపాడు పురాతన శివాలయాన్ని దర్శించిన కలెక్టర్, ఎమ్మెల్సీ జంగా
- ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకరిస్తాం
- 18 ఎకరాల్లో పెన్సింగ్ వేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశం


పురాతన శివాలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్సీ జంగా

దాచేపల్లి : పల్నాటి తొలి మహిళా మంత్రిని నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులోని పురాతన శివాలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. శివాలయం విశిష్టతను, చరిత్రను కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జంగా వివరించారు. శివాలయానికి కేటాయించిన 18 ఎకరాల స్థలంలో ఆక్రమణలు తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 11వ శతాబ్దంలో ఈ శివాలయాన్ని నిర్మించినట్లుగా చరిత్ర చెబుతుందని, రాష్ట్రంలో ఒక మంచి శివాలయంగా తీర్చిదిద్ది ఆధ్యాత్మిక వాతావరణం కలిప్తామని కలెక్టర్ శివశంకర్ చెప్పారు. గ్రామంలో నుంచి శివాలయంకు వచ్చేందుకు 40 అడుగుల విస్తీర్ణంలో రోడ్డు నిర్మాణంకు చర్యలు తీసుకుంటామని, పురాతనమైన ఈ శివాలయం పునః నిర్మాణానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. శివాలయం అభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేస్తామని, ప్రజలు ఎటువంటి అపోహాలకు తావు ఇవ్వకుండా శివాలయం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ శివశంకర్ కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ..తాను పుట్టిపెరిగిన ఊరిలో ఉన్న ఈ శివాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందని, దీన్ని ఒక యజ్ఞంలాగా తీసుకుని పనిచేస్తానన్నారు. పురావస్తుశాఖ పరిధిలో ఈ దేవాలయాన్ని గుర్తించారని, ఆధ్యాత్మిక భావం ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. మే నెలలో ఆలయ జీర్ణోద్ధరణ కోసం పూజ కార్యక్రమాలు చేస్తామని ఎమ్మెల్సీ జంగా తెలిపారు. తాళ్లయపాలెం శివాలయం పీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజల సహకారంతో ప్రపంచ స్థాయిలో నిలిచేలా ఈ శివాలయంను అభివృద్ధి చేయబోతున్నామన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కె. అద్దయ్య, సర్పంచ్ జంగా సురేష్, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, కోవిడ్ సహృదయ పౌండేషన్ వ్యవస్థపకురాలు డాక్టర్ జీ. అనూహ్యారెడ్డి, కౌన్సిలర్లు షేక్ షరీఫ్, వైఎస్సార్ సీపీ వాణిజ్యవిభాగం జోనల్ ఇన్‌చార్జీ మాశెట్టి బుజ్జి, తహసీల్దార్ దొప్పలపూడి మేరికనకం, మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు, బత్తుల వెంకయ్య, జంగా సైదులు, పువ్వాడ అమర్, ఐలాపురం నరసింహారావు తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండ రెడ్డి

గురజాల : రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండ రెడ్డి సూచించారు. మండల పరిదిలోని అంబాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమల కుమారి అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందన్నారు. కావున ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం విధానాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పొలాలు ఖాళీగా ఉంచకుండా 365 రోజులు ఏదో ఒక పంటతో కప్పి ఉంచాలని అలా ఉంచితే భూమిలో సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది సేంద్రియ కర్బాన శాతం పెరిగి భూమిలో నీటి నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. రైతులందరికి అందుబాటులో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో అనుసంధానంగా కలిసి పని చేస్తు రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రత్తి పంటలో ఏ గ్రేడ్ విధానంలో నాలుగు దిక్కులు మొక్కజొన్న లేదా సజ్జ పంట మొక్కలను వేయాలన్నారు. అనంతరం రైతులకు పిఎండిఎస్ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమలకుమారి, జల వనరుల కేంద్రం ఏడీఏ బివి శివకుమారి, ప్రకృతి వ్యవసాయం ట్రైనీ జగదీష్, వినోద, రైతు భరోసా కేంద్రాల వీఏ ఏలు, విహెచ్ లు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సాయి మార్కోండరెడ్డి, వ్యవసాయాధికారులు

పరీక్ష సామగ్రి వితరణ

శావల్యాపురం: పేదరికం ప్రతిభకు అడ్డుకాదని విశ్వశాంతి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ యడవల్లి శ్రీనివాసశర్మ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ చేశారు. ఈసందర్భంగా పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో 575 మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్‌మీడియల్ విద్య ఉచితంగా చేర్చుకుంటామన్నారు. 550 మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు. విద్యార్థులు విద్యను ఇష్టంతో పోటీతత్వంతో చదివి మంచి మార్కులు సాధించి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి గ్రామానికి పాఠశాల మంచి పేరు తేవాలన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.భువనేశ్వరదేవి, బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు హనుమంతరావు, నిర్మలకుమారి, సువర్చలాదేవి, ప్రశాంతకుమారి, కొడాలి శ్రీకాంత్ హీబీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని జయప్రదం చేద్దాం


కరపత్రాలను విడుదల చేస్తున్న మహాజన సోషలిస్టు పార్టీ నేతలు

విజయపురిసౌత్: మహాజన నేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ నెల 31 నుంచి జరుగుచున్న పోరాటాల్లో మాదిగ ఉపకులాలంతా పాల్గొని జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ పల్నాడు జిల్లా నాయకుడు, మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డిపర్తి శ్రీనివాసరావు మాదిగ అన్నారు. బుధవారం విజయపురిసౌత్‌లో మహాజన సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకులు పలుకూరి జోసఫ్‌బాబు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ మార్చి 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 3వ తేదీన బీజేపీ కార్యాలయం ముందు ధర్నా, 4న విజయవాడ నగరాన్ని అష్టదిగ్బంధం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోరాట కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మహాజన నాయకులు కోట ప్రకాష్ మాదిగ, గోన మోషే మాదిగ, బీర్నీడి నాగేశ్వరావు మదిగ, కోటయ్య మాదిగ, కొండయ్య మాదిగ, డాకురి యాకోబు మాదిగ, రాందాస్ మాదిగ పాల్గొన్నారు.

సమగ్ర అధ్యయనం అవసరం

నరసరావుపేట రూరల్: విద్యార్థులు ప్రతి విషయాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనరు ఎస్ఏవీ ప్రసాదరావు సూచించారు. బుధవారం పెట్లూరివారిపాలెం సమీపంలోని ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో నిర్వహించిన ఏఎన్‌ఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్–2023 ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అట్టహాసంగా నిర్వహించిన ఫెస్ట్‌కు ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు టీవీ నారాయణ, జేఎన్‌టీయు–కే ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, యాక్సిస్ క్లినికల్ లేబొరేటరీ జాయింట్ డైరెక్టర్ ఏజేసీ రెడ్డి, ఏపీ బార్ డిసిప్లినరీ కమిటీ మాజీ కమిటీ మెంబర్ ఎస్.బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకాగా, గౌరవ అతిథులుగా విద్యాసంస్థల సెక్రటరీ అండ్ ప్రెసిడెంట్ అట్లూరి శాంతి, జి.చంద్రశేఖరరెడ్డి, అనసూయ హాజరయ్యారు. అతిథులుగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.జయకృష్ణ, ఫార్మసీ ప్రిన్సిపల్ పి.భార్గవ భూషణరావు, డిప్లమా ప్రిన్సిపల్ కె.కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెక్నికల్, కల్చరల్, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్, వివిధ రకాల క్రీడల్లో విజేతలకు అతిథులు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు.


ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు, కళాశాల ప్రతినిధులు

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- నగర పంచాయతీ కమిషనర్



గురజాల : చిన్నారులకు, బాలింతలకు అంగన్ వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించే విదంగా చూడాలని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ అన్నారు. నగర పంచాయతీలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు రక్తహీనత లేకుండా చూడాలని వారికి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పలు సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. వారికి మెను ప్రకారం వారికి ఆహారాన్ని అందించాలన్నారు. ఆయనతో పాటు అర్బన్ హెల్త్ క్లీనిక్ వైద్యుడు నితిన్, సచివాలయ సిబ్బంది రాము, లక్ష్మీ, లలిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మాచర్ల: ప్రతి క్రైస్తవుడు ఏసు క్రీస్తు బోధనలను అనుసరించాలని పాస్టర్ రోషన్ కుమార్ అన్నారు. బుధవారం మినిస్ట్రీస్ పాస్టర్ మాగులూరి చంద్రపాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని షాలోం మందిరం ఏర్పాటు చేసిన క్రీస్తు పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుల ఆధ్వర్యంలో మినిస్ట్రీస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ అసోసియేషన్ అధ్యక్షులు మేడి యాకోబు, సంయుక్త కార్యదర్శి కుక్కమూడి వెంకయ్య, పాస్టర్ ఎలీషా, యోహాన్‌లు ప్రత్యేక సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో క్రైస్తవులు, పాస్టర్లు పలువురు పాల్గొన్నారు.